సాక్షి
మంచిర్యాల
శనివారం । 30 । డిసెంబర్ । 2023



బడులకేదీ ఉచితం..

ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ బిల్లులు రూ.వేలల్లో వస్తున్నాయి. ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ అందించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 10లో▸

పోలీస్‌స్టేషన్ తనిఖీ

జైపూర్: స్థానిక పోలీసుస్టేషన్‌ను జైపూర్ ఏసీపీ మోహన్ శుక్రవారం తనిఖీ చేశారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, ఆయా కేసుల్లో పట్టుబడిన వాహనాలు, ఇతర ప్రాపర్టీ పరిశీలించారు. వాహనాల వివరాలు, కేసుల స్థితిగతులు తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు, ఎస్సై ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0 /16.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు మెగా లోక్ అదాలత్

మంచిర్యాలక్రైం: పెండింగ్ కేసుల పరిష్కారానికి ఈ నెల 30న మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయమూర్తి బోయ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. సామరస్యంగా, వేగవంతంగా పరిష్కారం పొందడంతోపాటు చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి పొందవచ్చని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నుంచి కింది స్థాయి కోర్టుల వరకు పెండింగ్ కేసులన్నీ లోక్ అదాలత్‌తో ఇరు వర్గాలు పరిష్కారం పొందవచ్చని తెలిపారు. కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఈ నెల 30న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో తమ కేసులు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

బీట్ ఆఫీసర్ లత ఆత్మహత్యాయత్నంపై నేడు విచారణ

మంచిర్యాలక్రైం: కోటపల్లి రేంజ్ పరిధిలోని యెంచపల్లి బీట్ ఆఫీసర్ జీ.లత ఆత్మహత్యాయత్నంపై శనివారం ఉన్నతాధికారుల సమక్షంలో విచారణ చేపట్టనున్నారు. ఎఫ్ఆర్‌ఓ రవి, క్లర్క్ ఖరీమ్, సెక్షన్ ఆఫీసర్ రాందాస్ వేధింపులు భరించలేక ఈ నెల 9న లత ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ ఘటన అటవీ శాఖలో చర్చనీయాంశంగా మారింది. బాధితురాలు ఫిర్యాదు చేయలేదని అధికారులు పట్టించుకోలేదు. లత ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఈ నెల 18న అటవీ శాఖ ఉన్నతాధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో సీఎఫ్ఓ శాంతరాం, డీఎఫ్ఓ శివ్‌ఆశిష్‌సింగ్ కమిటీ సమక్షంలో ఈ నెల 30న విచారణకు ఆదేశించారు. శనివారం కమిటీ చైర్‌పర్సన్/ప్రిసైడింగ్ అధికారి కే.రమాదేవి సమక్షంలో విచారణ నిర్వహించనున్నారు. కాగా, లత ఆత్మహత్యాయత్నంపై అధికారులు కొంత నిర్లక్ష్యం చేసినప్పటికీ 'సాక్షి' పలు కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు విచారణకు ఆదేశించగా.. ఇప్పటికైనా లతకు ఏ మేరకు న్యాయం చేకూరుతుందో వేచి చూడాల్సిందే.

ఫోరెన్సిక్ సైన్స్ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) గురుకుల కళాశాల విద్యార్థులు ఆలిండియా ఫోరెన్సిక్ సైన్స్ ప్రవేశ పరీక్షలో జయభేరి మోగించారు. 20 మంది కౌన్సెలింగ్‌కు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. 2024–25 విద్యాసంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేషన్ ప్రవేశం కోసం ఈ నెల 23న జాతీయ స్థాయిలో ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్ టెస్ట్(ఏఐఎఫ్ సెట్–2024) నిర్వహించారు. కళాశాల నుంచి 20 మంది విద్యార్థులు హాజరు కాగా, జాడి రోహన్ రాజ్ 100 మార్కులకు గాను 67 మార్కులతో టాప్ ర్యాంక్ సాధించాడు. వీరంతా జనవరిలో జరిగే కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు.

విద్యార్థులు వీరే..

కౌన్సెలింగ్‌కు ఎంపికైన విద్యార్థుల్లో జాడి రోహన్‌రాజ్, ప్రదీప్, పుట్టల శివ, బి.శ్రావణ్, కొండగొర్ల రిషి, కోట అభిరామ్, దుర్గం శ్రీరామ్, కామెర విష్ణు చైతన్య, దుగుట అంజి, ముప్పిడి శ్రీకర్, గోగర్ల జస్వంత్, ఆడే నవనీత్, బండారి శివమూర్తి, ఆకుతోట శివసాయి, బిడ్డల రాకేష్, ఎల్లాకుల సంజయ్ కృష్ణ, తీగల ఆశ్రిత్, రావుల అభిరామ్, ఏనుగుల వివేక్, పీ.విల్సన్ ఉన్నారు. విద్యార్థులను ఉమ్మడి జిల్లా సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సంయుక్త కార్యదర్శి కంభంపాటి శారద, కో–ఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి అభినందించారు.

పీహెచ్‌సీలో పరిశీలన



సమీక్షిస్తున్న డాక్టర్ సరస్వతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)ను జాతీయ నాణ్యత ప్రమాణాల పరీక్ష(ఎన్‌క్యూఏఎస్) బృందం శుక్రవారం పరిశీలించింది. డాక్టర్ సుప్రియాచౌదరి(కోల్‌కతా), డాక్టర్ సరస్వతి (చెన్నయ్) ఆస్పత్రిలో ఓపీ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ, ల్యాబ్, ఫార్మసీతోపాటు సాధారణ పాలన పరమైన అంశాలపై సమీక్షించారు. రికార్డులు పరిశీలించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అనిత, డాక్టర్ విజయపూర్ణిమ, డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డాక్టర్ నీరజ, డాక్టర్ శివప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లహరి, బస్ యూనిట్ అధికారి నాందేవ్, ఎన్‌హెచ్ఎం డీపీఓ ప్రశాంతి, డీపీహెచ్ ఎన్ఓ రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహితకు ప్రాణం !



కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది(ఫైల్)

- కాంగ్రెస్ సర్కారు రాకతో మళ్లీ కదలిక
- 'తుమ్మిడి హెట్టి' వద్ద ప్రాజెక్టుకు సుముఖం
- 'కాళేశ్వరం'పై విచారణ పూర్తయితే ముందుకు
- ఉమ్మడి జిల్లా రైతాంగం సాగునీటికి భారీ ఊరట



నెన్నెల: మైలారం నుంచి పైపుల తరలింపు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'కాళేశ్వరం' ప్రాజెక్టుతో ఉనికిని కోల్పోయిన డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు కాంగ్రెస్ సర్కారు రాకతో మళ్లీ ప్రాణం పోసేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టేసిన విషయం తెలిసిందే. రీ డిజైన్ పేరుతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును ప్రతిపక్షం నుంచే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంతోపాటు అధికారం వచ్చాక కూడా కాళేశ్వరంపై విచారణ జరిపిస్తామని ప్రకటించగా.. ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు.

ఉపయోగపడని 'కాళేశ్వరం'

కుమురంభీం జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మించి తెలంగాణను సస్యశ్యామలం చేయాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టుకు ప్రణాళిక రచించారు. 2007లో ఆదిలాబాద్, మరో ఐదు జిల్లాలకు సాగు, తాగునీరు అందించేందుకు 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు' చేపట్టారు. 152అడుగుల ఎత్తు, 28ప్యాకేజీలతో రూ.38,500కోట్ల అంచనాతో నిర్మించేలా డిజైన్ చేశారు. మొత్తం 16.40లక్షల ఎకరాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోనే 2లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. తుమ్మిడిహెట్టి నుంచి పైప్‌లైన్లు, రిజర్వాయర్లు నిర్మించి ఎల్లంపల్లి వరకు గ్రావిటీతో నీరు తరలించాలనేది లక్ష్యం. భూసేకరణ, కాలువల నిర్మాణం కోసం రూ.10వేల కోట్లు వెచ్చించారు. కానీ 2009లో వైఎస్సార్ అకాల మరణంతో మరుగునపడింది. తర్వాత మహారాష్ట్ర సర్కారుతో ప్రాజెక్టు ఎత్తు విషయంలో పేచీ మొదలైంది. 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మిస్తే చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాల్లో ముంపు ఉందని అభ్యంతరం తెలిపింది. ఈ అభ్యంతరాలను సాకుగా చూపి నాటి సర్కారు, గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టుకు డిజైన్ చేసి, వేగంగా నిర్మాణం పూర్తి చేసింది. ప్రత్యామ్నాయంగా రూ.1918 కోట్ల అంచనాతో సముద్రమట్టానికి 148 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టేందుకు ప్రణాళిక వేశారు. తర్వాత మళ్లీ రూ.700కోట్లతోనే వార్దానది మీద బ్యారేజీ నిర్మించి, ఎల్లంపల్లి తరహాలో 20టీఎంసీల దాకా నిల్వ చేసి, గ్రావిటీతో సాగునీరు ఇవ్వచ్చని మార్పులు చేశారు. డీపీఆర్ కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ 'వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్(వాప్కోస్)'కు అప్పగించినా నిర్మాణం దిశగా అడుగు పడలేదు.



'ప్రాణహిత–చేవెళ్ల' శంకుస్థాపన ఫలకం(ఫైల్)

ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు..

కాంగ్రెస్ ప్రభుత్వం హామీతో ఇక్కడి రైతాంగంలో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మళ్లీ నీరందితే రైతులకు సాగునీటి గోస తీరనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చుట్టూ అపారమైన నీరు ఉన్నా ఎక్కడా ఉపయోగపడిన దాఖలులేవు. పెన్‌గంగా, వార్దా, వెన్‌గంగా, ప్రాణహిత, గోదావరి నదుల నీటి ఇక్కడి రైతుల చేన్లకు చేరడం లేదు. దీంతో ఏళ్లుగా ఆరుతడి పంటలే దిక్కవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి నుంచి ఏటా పది టీఎంసీలను చెన్నూరు ఎత్తిపోతల పథకంతో లక్ష ఎకరాలకు నీరందించాలనే పథకానికి నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తే ఈ ఎత్తిపోతల పథకం నిలిచిపోనుంది.

కాలువలు ధ్వంసం, పైపుల తరలింపు

ప్రాణహిత ప్రాజెక్టు ఆగిపోవడంతో తవ్విన కాలువలు ధ్వంసం, కబ్జాలయ్యాయి. సేకరించిన భూములు సైతం అన్యాక్రాంతం అయ్యాయి. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో మొత్తం 70కి.మీ కాలువలు తవ్వాలి. మొదట ప్యాకేజీ 5లో 17.9కిలోమీటర్లు పైపులైన్‌లో, 3.6డయామీటర్ ఎంఎస్ (మైల్డ్ స్టీల్) పైపులు వాడారు. 4.9కిలోమీటర్లు భారీ కాలువలు తవ్వి ఏర్పాటు చేశారు. మరో 13కిలోమీటర్లు పైపులైన్ వేయాల్సి ఉంది. ఖాళీగా ఉన్నాయని ఈ పైపులను ఎల్లంపల్లి వరద కాలువ, మిడ్‌మానేరు నుంచి మల్లన్న సాగర్ వరకు పైపులైన్ వాడేందుకు ఇక్కడి నుంచి కాంట్రాక్టరు తరలించారు.

పోటెత్తిన దరఖాస్తులు

- రెండో రోజు 42,464
- ఇప్పటివరకు 65,779



దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలన కార్యక్రమంలో రెండో రోజు శుక్రవారం 42,464 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. జిల్లాలోని 16మండలాల్లో 57 కేంద్రాలు, ఏడు మున్సిపాల్టీల్లో 174 కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. రెండో రోజు గ్రామ పంచాయతీల్లోని గ్రామ సభల్లో 33,180 కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉండగా.. 21,872 దరఖాస్తులు అందాయి. మున్సిపాలిటీల్లోని వార్డుల్లో 41,717 కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉండగా 20,592 దరఖాస్తులు స్వీకరించారు. రెండ్రోజుల్లో 65,779 మంది దరఖాస్తులు సమర్పించారు. పలు కేంద్రాల్లో దరఖాస్తుల కొరత ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జిరాక్స్ కేంద్రాల్లో రూ.10 వరకు చెల్లించి కొనుగోలు చేసి దరఖాస్తు చేసుకున్నారు.

అదనపు కలెక్టర్ పర్యవేక్షణ

జిల్లాలోని వేమనపల్లి మండలం, చెన్నూర్ పట్టణంలో ప్రజాపాలన కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ శుక్రవారం పాల్గొన్నారు. అర్హులకు పథకాలు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాల్లో ప్రజాపాలన నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు మహిళలు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ కౌంటర్లు, తాగునీరు, టెంట్లు, కౌంటర్ల టేబుళ్లు, బారికేడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రతీ దరఖాస్తుకు ఒక ప్రత్యేక సంఖ్య కేటాయిస్తామని తెలిపారు.

'అంగన్‌వాడీ' అస్తవ్యస్తం

- టీచర్, ఆయా పోస్టులు ఖాళీ
- పౌష్టికాహారం పంపిణీపై ప్రభావం
- టీచర్లకు అదనపు బాధ్యతలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు(ఫైల్)

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల ఖాళీలతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఫలితంగా చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం పంపిణీపై ప్రభావం పడుతోంది. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించాల్సి ఉండగా సిబ్బంది కొరతతో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి వారికి సరైన పౌష్టికాహారం అందిస్తుంటారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీల కారణంగా సమీపంలోని మరో అంగన్‌వాడీ కేంద్రం టీచర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించి నిర్వహిస్తున్నారు. దీంతో రెండు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సేవలు అందించడం కష్టంగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 71 ఖాళీగా ఉండగా, ఆయా పోస్టులు 161 ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లాలోని 73 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడంతో మరో 73 మంది ఆయాలను కొత్తగా తీసుకోవాల్సి ఉంది. దీంతో ఆయాలు ఖాళీగా ఉండే కేంద్రాల సంఖ్య 234కు చేరనుంది.

అదనపు భారం

జిల్లాలో 896 అంగన్‌వాడీ కేంద్రాలు, 73 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్‌తోపాటు ఒక ఆయా తప్పనిసరిగా ఉండాలి. 896 కేంద్రాల్లో 56 టీచరు పోస్టులు ఖాళీగా ఉండగా, ఆయా పోస్టులు 161 ఖాళీగా ఉన్నాయి. మిగతా 73 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 15 టీచరు పోస్టులు ఖాళీగా ఉండగా, మొత్తం టీచరు పోస్టుల ఖాళీల సంఖ్య జిల్లాలో 71కి చేరింది. 73 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడంతో అక్కడ తప్పనిసరిగా ఆయాలను నియమించాల్సి ఉంటుంది. చిన్నారులు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం పంపిణీ, వారి ఆరోగ్య స్థితి పరిశీలన వంటివి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే జరుగుతుంటాయి. ప్రతీ ఒక్క లబ్ధిదారుకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ జరగాల్సి ఉండగా, ఖాళీలతో సేవలపై ప్రభావం పడుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు అంతే సంఖ్యలో ఉండగా, పెరిగిన జనాభాతో లబ్ధిదారుల సంఖ్య పెరిగి అంగన్‌వాడీ టీచర్లపై అదనపు భారం పడుతోంది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులతో ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం అదనపు పనులు అప్పగించడంతో వారి విధులకు న్యాయం చేయలేక పోతున్నారు. బూత్ లెవల్ ఆఫీసర్లుగా, ఎన్నికల విధులతోపాటు ఏ సర్వే చేపట్టాల్సి ఉన్నా అంగన్‌వాడీ టీచర్లకే అప్పగిస్తుండడంతో అదనపు భారం పడుతోంది. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్లకు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కోసం విధులు కేటాయించడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లకుండా రోజంతా ప్రజాపాలన సభలోనే ఉంటున్నారు. ప్రభుత్వం అప్పగించే ఇతర విధుల్లో పాల్గొనడంతో పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోతున్నారు. ఖాళీగా ఉన్న టీచర్, ఆయాల పోస్టుల భర్తీ చేస్తేనే కొంత వరకైన లబ్ధిదారులకు లాభం చేకూరేందుకు అవకాశం ఉంది.

ఖాళీల భర్తీ కోసం నివేదించాం



జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాల పోస్టుల వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తాం. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. ప్రతీ లబ్ధిదారుకు పౌష్టికాహారం అందించడంతోపాటు చిన్నారులు కేంద్రాలకు వచ్చేలా చూస్తున్నాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమశాఖ అధికారి

తీరు మారలేదు..!



భర్త సుపారీ ఇచ్చి హత్య చేయించడంతో మృతిచెందిన శరణ్య(ఫైల్)

- పెరిగిన హత్యలు, ఆత్మహత్యలు
- ప్రాణం తీసిన రహదారులు

మంచిర్యాలక్రైం: మరో సంవత్సరం గడిచిపోయింది. ఎలా గడిచిందో ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే క్షణ క్షణం.. భయం భయం అన్నట్లుగా కాలం గడిచింది. జిల్లాలో అక్కడక్కడ రోడ్డు ప్రమాదాలు, హత్యలు, ఆత్మహత్యలు, కిడ్నాప్ సంఘటనలు కన్నీరు మిగిల్చాయి. అవే నేరాలు.. ఘోరాలతో తీరు మారలేదు. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో కేసుల ఛేదనలో పోలీసులు ముందున్నా.. చోరీ కేసుల్లో నగదు రికవరీలో కొంత వెనుకబడ్డారు.

పెరిగిన హత్యలు..

ఆస్తి తగాదాలు, ప్రేమ వ్యవహారం, వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలతో క్షణికావేశంలో హత్యలు, ఆత్మహత్యలు కుటుంబాలను చిన్నాభిన్నం చేశాయి. జిల్లాలోని జైపూర్ మండలం ఇందారానికి చెందిన ఓ మహిళను ప్రేమ పేరుతో వేధించినందుకు యువకుడిని ఆమె కుటుంబ సభ్యులో నడిరోడ్డుపై అతి కిరాతకంగా నరికి చంపారు. మందమర్రి మండలం గద్దరాగడి సమీపంలో స్థిరాస్తి గొడవలో రియల్ ఎస్టేట్ వ్యాపారి లక్ష్మీకాంతరావును నమ్మినబంటులే కిరాతకంగా హత్య చేశారు. జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడకు చెందిన బత్తిని శరణ్యను ఆమె భర్త సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ జియ ఉల్ హక్ కుటుంబ తగదాలతో రూ.9లక్షలు సుపారీ ఇచ్చి హత్య చేయించాడు. ఈ ఘటనలు ఈ ఏడాదిలో సంచలనం సృష్టించాయి.

ఆత్మహత్యలు..

మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ నల్లమల్ల బాలకృష్ణ భార్య జ్యోతి(32) ఆత్మహత్య సంచలనం సృష్టించింది. కుటుంబ కలహాలతో నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌కు చెందిన ఇప్ప రవీందర్ భార్య శరణ్య(30) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంచిర్యాలలోని తిలక్‌నగర్‌కు చెందిన సామల గ్రీష్మ(21) ఓ యువకుడిని ప్రేమించింది. ప్రేమను తల్లిదండ్రులు ఒప్పుకోలేదని మనస్తాపంతో క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంది. మందమర్రిలోని దీపక్‌నగర్ నలంద కాలనీలో తల్లీకూతురు ధనలక్ష్మి, జీవని ఆత్మహత్య చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదాలు

జిల్లాలో ఏడాదిలో జరిగిన 326 రోడ్డు ప్రమాదాల్లో 111 మంది మృతిచెందారు. 320 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణాపూర్‌లోని రాంనగర్‌కు చెందిన తొగరు రవి(45) చనిపోయాడు.

గంజాయి(డ్రగ్స్)..

జిల్లాలో గత ఏడాది కంటే ఈ ఏడాది గంజాయి కేసులు అధికంగా నమోదయ్యాయి. గత ఏడాది ఏడు కేసులు నమోదు కాగా 18మందిని అరెస్ట్ చేశారు. 7.82కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాదిలో 49 కేసులు నమోదు కాగా, 73మందిని అరెస్టు చేశారు. 483.338 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

తగ్గిన దొంగతనాలు

గతేడాది జరిగిన దొంగతనాలతో పోల్చి చూస్తే ఈసారి కొంత మేరకు తగ్గాయి. 2022లో రాత్రి, పగలు 286 దొంగతనాలు జరుగగా, ఈ ఏడాదిలో 266 చోరీలు జరిగాయి. రూ.2,05,16,050 సొత్తు చోరీ కాగా, రూ.87,84,900 రికవరీ చేశారు. చోరీ సొత్తు రికవరీలో పోలీసులు విఫలమయ్యారు.

మావోయిస్టుల అలజడి

ఈ ఏడాది మావోయిస్టుల అలజడి జిల్లాలో కలకలం రేపింది. ఎన్నికల సమయంలో లేఖలు విడుదల, వారోత్సవాలు, ఈ నేపథ్యంలో జైపూర్ మండలం ఇందారంలో ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు.

గత మూడేళ్లలో నమోదైన కేసులు

కేసులు	2021	2022	2023
హత్యలు	012	026	022
కిడ్నాప్	049	033	041
దొంగతనాలు	274	287	266
ఆత్మహత్యలు	430	408	377
మిస్సింగ్	262	335	302
ఎస్సీ/ఎస్టీ	100	086	074
పోక్సో	070	042	016
మోసాలు	370	258	349
డ్రగ్స్	017	007	049

సైబర్ నేరాలు ఈ ఏడాదిలో 117 నమోదు కాగా రూ.1,96,76,132 కోట్ల నగదు బాధితులు నష్టపోయారు.

భవిష్యత్ మనదే..!

- గులాబీ సైనికులకు అండగా నిలుస్తాం
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాబోయే భవిష్యత్ మనదేనని, పార్టీ కార్యకర్తలు ఎవ్వరూ నిరుత్సాహ పడకుండా ధైర్యంగా ఉండాలని, బీఆర్ఎస్‌కు మంచి రోజులు వస్తాయని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకున్న క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైందని, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అనేక సంక్షేమ పథకాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలతో కేసీఆర్ సారథ్యంలో దేశానికే దిక్సూచిగా నిలిచామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తుందని అన్నారు. పార్టీని వీడిన వారికి తగిన గుణపాఠం తప్పదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి అండగా ఉంటూ భవిష్యత్‌కు బాసటగా నిలుస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రతినిధులు, కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీ వీడిన వారు తిరిగి పార్టీలోకి రాకుండా కట్టడి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్‌లు పెంట రాజయ్య, ప్రభాకర్, నల్మాస్ కాంతయ్య, నాయకులు గాదె సత్యం, విజిత్‌బాబు, మొగిళి శ్రీనివాస్, సాగి వెంకటేశ్వర్‌రావు, ఆరె శ్రీనివాస్, పడాల రవి, కోటె సత్తయ్య, గరిగంటి సరోజ, టీబీజీకేఎస్ నాయకులు లక్ష్మణ్, సత్తయ్య, జక్కుల రాజేశం, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు కోవిడ్ జాగ్రత్తలు పాటించాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ప్రజలు కోవిడ్ జాగ్రత్తలు పాటించాలని, గుంపులుగా ఉన్న చోటకు వెళ్లకుండా ఉండాలని, వెళితే మాస్కు తప్పనిసరిగా ధరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మాస్కు ధరించాలనే అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు 169 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను సిద్ధం చేశామన్నారు. జిల్లాలో కొత్త రకం కరోనా జేఎన్ 1 వేరియంట్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌వో సంపత్‌కుమార్, జిల్లా కోవిడ్ నోడల్ అధికారి డాక్టర్ ఫయాజ్ ఖాన్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సునిల్, సుమన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాట్లాడుదామని పిలిచి దాడి

నస్పూర్: రోడ్డు ప్రమా దం కేసులో మాట్లాడుకుందామని పిలిపించి ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ ఏరియాలోని భగత్‌సింగ్‌నగర్‌లో నివాసం ఉండే జాంగిడి సతీష్, ఓంర్ర శివశంకర్‌లు ఈ నెల 10న భగత్‌సింగ్‌నగర్ నుంచి కారులో మందమర్రి వైపు వెళ్తుండగా శ్రీరాంపూర్ మందమర్రి జాతీయ రహదారి 363 బైపాస్‌లో దొరగారి పల్లె సమీపంలో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సతీష్‌కు గాయాలు కాగా ఓంర్ర శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు గుమాస కుమార స్వామి ఫిర్యాదు మేరకు సీసీసీ నస్పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కేసు విషయం మాట్లాడుదామని శుక్రవారం సతీష్‌ను మృతుడి బంధువు కుమార స్వామి, ఇతరులు సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని పీహెచ్‌సీ వద్దకు పిలిపించారు. దీంతో కుమారస్వామి, ఇతరులు సతీష్‌ను నానా దుర్భాషలాడుతూ బండరాళ్లతో దాడిచేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్‌ని సంప్రదించగా సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి బావిలో పడి మృతి

బెజ్జూర్: అదృశ్యమైన వ్యక్తి బావిలోపడి మృతిచెందినట్లు ఎస్సై విక్రం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని బారగూడెం గ్రామానికి చెందిన డబ్బా సురేష్(45) ఈ నెల 25న ఇంటి నుంచి బయల్దేరి తిరిగి రాలేదు. అతడి కోసం మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టగా గ్రామంలోని వ్యవసాయ బావిలో శుక్రవారం శవమై తేలాడు. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సురేష్ తాగుడుకు బానిసై మతిస్థిమితం లేక తొగరి తిరుపతి వ్యవసాయ బావిలో పడి మృతిచెందినట్లు పేర్కొన్నారు. శవ పంచనామా నిర్వహించి మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

జనావాసాల్లోకి నీలుగాయి

వేమనపల్లి: అడవుల్లో మేత కరువై వన్యప్రాణులు జనావాసాల్లోకి తరలివస్తున్నాయి. వేమనపల్లి గ్రామంలోని చర్చి వెనుకాల నీల్వాయి ప్రాజెక్టు 5ఆర్ కాలువ వద్దకు శుక్రవారం నీలుగాయి వచ్చింది. అటువైపు జనం కనిపించడంతో పంట చేళ్లలోకి పరుగులు తీసింది. భారీ ఆకారంతో చూడముచ్చటగా ఉన్న నీలుగాయి (మేకంను) చూడడానికి ప్రజలు ఆసక్తి కనబర్చారు. 5ఆర్ కాలువ రోడ్డు మీదుగా పరుగులు తీస్తూ కాలువ పై నుంచి రాజారాం వైపునకు పరుగులు తీసింది. నీలుగాయి జనావాసాల వైపు వచ్చిన విషయం తెలుసుకున్న అటవీ సెక్షన్ అధికారి రవికుమార్, ఎఫ్‌బీవో పోచన్న వచ్చి నీలుగాయి ఎటు వైపు వెళ్లిందో తెలుసుకున్నారు. దానిని దాడి ఎవరు చేయకూడదని, రాజారాం అటవీ వైపు వెళ్లేలా చొరవ తీసుకున్నారు.

'ఐ కార్'లో సీటు సాధించిన సీవోఈ విద్యార్థులు


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయ బావుటా ఎగురవేస్తున్నారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియా కౌన్సెల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐ కార్) లో ఇద్దరు విద్యార్థులు తాజాగా సీటు సాధించారు. ప్రవేశ పరీక్షలో నెగ్గిన విద్యార్థులు ఐ కార్ లో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులో చేరనున్నారు. రామటెంకి శ్రీనివాస్ 1277 ర్యాంకు, వాగ్మారే నితిన్ 1816 ర్యాంక్ తెచ్చుకున్నట్లు ప్రిన్సిపాల్ సైదులు వెల్లడించారు. శుక్రవారం సదరు విద్యార్థులను అభినందించారు.

రేపు ఎడ్లబండ్ల పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో 31వ తేదీ ఆదివారం ఎడ్ల బండ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో నిర్వాహకుడు తిప్పని మహేశ్ తెలిపారు. పూర్తి వివరాలకు 96525 96586 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బడులకేదీ ఉచితం..

- ఉచిత విద్యుత్ ప్రభుత్వ బడులకి స్తేనే సముచితం
- రూ.వేలల్లో పేరుకుపోతున్న బిల్లులు
- స్కూల్ గ్రాంట్‌లో సింహభాగం విద్యుత్ బిల్లులకే
- దృష్టి సారించాలంటున్న ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీలు

జిల్లాల్లోని పాఠశాలల వివరాలు..

జిల్లా	పాఠశాలలు
ఆదిలాబాద్	1,279
కుమురంభీం	1,148
మంచిర్యాల	847
నిర్మల్	842


డిజిటల్ తెరలపై పాఠాలు వింటున్న విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: గృహ అవసరాలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఉచితంగా విద్యుత్ అందించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు అంకురార్పణ జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు, ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. దీనికి తోడు ప్రాజెక్టర్లు, ఎల్‌ఈడీ టెలివిజన్లు కూడా ఆయా ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. దీనితోపాటు బల్బులు, ఫ్యాన్లు రోజువారీ కార్యకలాపాల కోసం కంప్యూటర్లు పనిచేస్తున్నాయి. విద్యార్థుల నిష్పాదన, మార్కులను నమోదు చేయడానికి ట్యాబ్‌లు అందించారు. వీటి చార్జింగ్, ఇతరత్రా అవసరాలకు విద్యుత్ తప్పనిసరి. ఈ నేపథ్యంలోనే ఆయా పాఠశాలలకు ఉచిత విద్యుత్‌ను అందించాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులకే...

ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ కనెక్షన్ అందుబాటులో ఉన్న వాటికి వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అకౌంట్లలో స్కూల్ గ్రాంట్లు ప్రభుత్వం వేసిన తర్వాతనే విద్యుత్ బిల్లులను చెల్లించాల్సి ఉంటుందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు పేర్కొంటున్నారు. అప్పటి వరకు పేరుకుపోయిన బిల్లులను చెల్లించేందుకే స్కూల్ గ్రాంట్లు వినియోగం అవుతున్నాయని వాపోతున్నారు. బడులకు అందించే విద్యుత్ ఏడవ కేటగిరీలో చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇందులో యూనిట్ విద్యుత్‌కు 8.30 వసూలు చేస్తున్నారు.

అదనపు భారమే ఇది...

పాఠశాలలకు ప్రతినెల వస్తున్న విద్యుత్ బిల్లులు అదనపు భారంగా పరిణమిస్తున్నాయి. యూనిట్ విద్యుత్ చార్జి రూ.8 పైగా ఉండడంతో ఆరు తరగతి గదులు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు నెలకు సుమారు రూ.800 వరకు ఆరు నుంచి పది గదులు ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు నెలకు సగటున రూ.1100 పైన బిల్లులు వస్తున్నట్లు సమాచారం. అదనంగా సర్‌చార్జీలు, ఆలస్య జరిమానాల రూపంలో మరో 200 వరకు బిల్లుకు కలుస్తోంది. దీంతో ఆయా పాఠశాలలకు ప్రతీఏటా రూ.10వేల నుంచి 12వేల వరకు విద్యుత్ బిల్లులకే వ్యయం అవుతున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఉచితంగా అందిస్తే మేలు...



ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్‌ను అందించడం సమంజసంగా ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులుగా మేము సైతం ఉచిత విద్యుత్‌ను అందివ్వాలని ఇప్పటికే విజ్ఞప్తి చేశాం. స్కూల్ గ్రాంట్‌లకు విడుదలవుతున్న నిధుల్లో చాలావరకు విద్యుత్ బిల్లులకే ఖర్చు చేస్తున్నారు.

– ఎస్.భూమన్న యాదవ్, జిల్లా అధ్యక్షుడు, స్టేట్ టీచర్స్ యూనియన్, నిర్మల్

డిజిటల్ బోధనకు తోడ్పాటు...



ప్రభుత్వ బడుల్లో ఉచిత విద్యుత్‌ను అందివ్వడం ద్వారా ఆ పాఠశాలలో ప్రస్తుతం అమర్చిన డిజిటల్ ప్యానెల్ బోర్డులు, ఎల్ఇడి తెరలు మరింత ఎక్కువగా వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ పూర్తిస్థాయిలో అందివ్వాలి. బోధన కూడా విద్యార్థులకు సులువుగా అర్థమవుతుంది.

– కొత్త కాపు రాజేశ్వర్, ఎస్ఎంసీ చైర్మన్, సోన్

సిక్ లీవ్‌లు పెంచాలి


మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): జేబీసీసీఐలో జరిగిన ఒప్పందాలకు అనుగుణంగా సింగరేణిలో సిక్ లీవ్ అమలు చేస్తూ సర్క్యులర్ జారీ చేయాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశాడు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జేబీసీసీఐ ఒప్పందాలను సింగరేణిలో వెంటనే అమలు చేయాలన్నారు. జేబీసీసీఐ ఒప్పందాల్లో భాగంగా బొగ్గు గని కార్మికులకు సిక్ లీవు నిలువ 120 నుంచి 150కి పెంచడం జరిగిందని, దానికి అనుగుణంగా సింగరేణిలో కొత్త సంవత్సరం నుంచి పెంచిన సిక్‌లీవ్‌లకు సంబంధించిన సర్క్యులర్‌ను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31తో సంవత్సరం మారుతున్నందున కొత్త సంవత్సరంలో కార్మికులకు వచ్చే 15 సిక్ లీవులు వృథా అయ్యే అవకాశం ఉందన్నారు. ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీలను పెరిగిన రేటుకు అనుగుణంగా రూ.12వేలకు బదులు రూ.15వేలు చెల్లించేలా సర్క్యులర్ జారీ చేయాలన్నారు. సమావేశంలో ఏరియా నాయకులు మాంతు సమ్మయ్య, మారిన వెంకటేశ్వర్లు, నల్లగొండ సదాశివ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శీతాకాలం సాగులో మెలకువలు

- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలంటున్న శాస్త్రవేత్తలు


శివకృష్ణ, శాస్త్రవేత్త

బెల్లంపల్లి: శీతాకాలంలో సాగు చేస్తున్న పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులు అనుసరించాల్సి ఉంది. ప్రస్తుతం చలి తీవ్రత పెరిగింది. కొముం రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 15డిగ్రీల కన్నా దిగువకు పడిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో పంటలు సాగు చేస్తున్న రైతులు తగిన చర్యలు చేపట్టాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కె.శివకృష్ణ తెలిపారు. చలి వాతావరణంలో పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను పేర్కొన్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...

- వరి సాగులో ఎకరాకు పశువుల ఎరువు లేదా కోళ్ల ఎరువు 200కిలోలు పోయడం ద్వారా పంటకు సూక్ష్మపోషకాలు, జింక్, ఐరన్ అధికంగా లభిస్తుంది. చలి తీవ్రతను తట్టుకోవడానికి ట్రార్పాలిన్ కవర్లు సాయంత్రం పూట కప్పాలి. నారుకు అగ్గి తెగలు ఆశిస్తే నివారణ కోసం ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథయోలేన్ 1.5 మిల్లీలీటర్లు లేదా కాసుగామైసిన్ 2.5 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ.
- మొక్కజొన్న సాగులో భాస్వరం లోపంతో ఆకులు ఊదా రంగులోకి మారుతాయి. ఈ వ్యాధి నివారణ కోసం 10గ్రాముల 19:19:19 లేదా డీఏపీ లీటర్ నీటిలో పిచికారీ చేయాలి. కత్తెర పురుగు నివారణకు 0.3 మిల్లీ లీటర్ క్లోరాంతనిప్రోల్ లేదా 0.5మి.లీ స్పైనటోరం మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.


వరినారు మడి

- వేరుశనగ సాగులో లద్దె పురుగు నివారణకు వేపనూనె లేదా 200 మిల్లీ లీటర్ల నోవల్యూరాన్ పిచికారీ చేయాలి.
- జొన్న సాగులో పేనుబంక పురుగు సోకితే రెండు మిల్లీ లీటర్ల మిథైల్ డెమటాన్ లేదా డైమిథోయేట్ ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. శనగ సాగులో పచ్చ పరుగు నివారణకు 1.5 గ్రాముల ఎసిఫేట్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయడంతో పురుగు ఉధృతిని నివారించవచ్చన్నారు. మిరప పంట సాగులో వాతావరణ మార్పులతో తామర పురుగు ఆశించే అవకాశం అధికంగా ఉందని, దీనిని నివారించడానికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా పిప్రానిల్ 2 మి.లీ లేదా డైమిథోయేట్ 2 మి.లీ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని, కాయకుళ్లు తెగులు నివారణకు ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజేబ్ లేదా 1 మి.లీ ప్రోపికోనజల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయడంతో చీడపీడల బెడదను నివారించవచ్చన్నారు. పంటల సాగులో సందేహాలు ఉంటే కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలను సంప్రదించాలని సూచించారు.

ఆవిష్కరణతో అద్భుతం.. జపాన్‌కు ఆహ్వానం

- అన్నారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఘనత
- సాంకేతిక ఆవిష్కరణతో సత్తాచాటిన వైనం
- జాతీయ ఇన్‌స్పైర్ అవార్డు గ్రహీత మనిప్రసాద్‌కు పిలుపు


మనిప్రసాద్ తయారు చేసిన ప్రాజెక్ట్ ఇదే


మనిప్రసాద్‌ను అభినందిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: కోటపల్లి మండలం అన్నారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన మనిప్రసాద్ తయారు చేసిన ప్రాజెక్టుకు అద్భుత అవకాశం లభించింది. జపాన్‌లో నిర్వహించే సకూర సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. మేలో నిర్వహించే సకురా ప్రోగ్రాంకు మనిప్రసాద్‌కు ఆహ్వానం అందింది. అక్టోబర్‌లో ఢిల్లీలో నిర్వహించిన జాతీయ ఇన్‌స్పైర్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనతో కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి జితేందర్‌సింగ్ చేతుల మీదుగా జాతీయ ఇన్‌స్పైర్ అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది తెలంగాణ వ్యాప్తంగా ఐదుగురు విద్యార్థులకు ఈ అవకాశం లభించగా జిల్లాకు చెందిన మనిప్రసాద్ ఉన్నారు. శుక్రవారం మంచిర్యాల డీఈవో కార్యాలయంలో మనిప్రసాద్‌తో పాటు గైడ్ టీచర్ సురేందర్, అన్నారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ డీఈవో యాదయ్య సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతికను తెలుసుకోవటం.. మరిన్ని ఆవిష్కరణలను సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ కార్యక్రమం అన్ని విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి చౌదరి, డీఎస్‌వో మధుబాబు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ ఇదిగో...

దేశానికి వెన్నుముకైనా రైతు తాను కష్టపడి పండించిన పంటను నిల్వ చేసుకోవడం కోసం ఆరబోస్తూ ఉంటాడు. అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తేమగా ఉంటే అక్కడ అరబోసి కొనుగోలు చేసే వరకూ నాలుగు రోజుల వరకు పట్టే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో ఢర్షం కురవటం.. పశువుల తింటాయని రైతు అక్కడే కాపాలాగా ఉండాల్సిన పరిస్థితి. ఈ సమస్య నివారణకు గ్రేన్ ప్రొటెక్టర్ ఫ్రమ్ రేన్ అండ్ ఎనిమాల్ ప్రాజెక్టును రూపొందించాడు.

పనిచేసే విధానం..

ద్రవాల విద్యుత్ వాహకతపై (తడి సెన్సార్) ఆధారపడి పనిచేస్తుంది. కర్రలు (గుంజలు) ప్లాస్టిక్ పైపులు, కవర్లు, రైన్‌సెన్సార్, మోటర్ ప్రోగ్రామింగ్ మైక్రో కంట్రోలర్, సోలార్ ప్లేట్, 12 వోల్టేజ్‌బ్యాటరీ, ఇనుపతీగ, బజర్ 1.5 వోల్టేజ్ బ్యాటరీలు.

వినియోగం..

ధాన్యం అరబోసే ప్రాంతంలో రెండు వైపుల ఏటవాలుగా ఉండే విధంగా కర్రలు, ప్లాస్టిక్ పైపులతో పందిరిలా ఏర్పాటు చేయాలి. దీనిలోపల నేల కొంచెం ఎత్తుగా ఏర్పాటు చేయాలి. దానిపై కవర్ వేసి ధాన్యం అరబోయాలి. దీనిపై భాగంలో ఒక మైక్రో కంట్రోలర్‌కి కలపడిన రేన్‌సెన్సార్ అమర్చాలి. కవర్స్ రూలర్‌కు చుట్టి ఈరూలర్స్ మెక్రో కంట్రోలర్‌కు కలపబడిన మోటార్‌కు జత పర్చాలి. వర్షం వస్తే వర్షపు చినుకులు రైన్ సెన్సార్‌పై పడగానే మైక్రో కంట్రోలర్‌కి సమాచారం ఇస్తుంది. మైక్రో కంట్రోలర్ సమాచారం చేరటంతో మోటార్ రోటేట్ అవుతుంది. రోలర్ రోటేట్ అవుతూ కిందికి వచ్చిన ధాన్యంపై కప్పబడుతోంది. నేలపై పడిన నీరుధాన్యంలోకి రాకుండా ఉంటుంది. పందిరి చుట్టు కింద భాగంలో కొంత ఎత్తులో తీగలు అమర్చుతారు. ఏవైనా జంతువులు ధాన్యంలోకి రావడానికి ప్రయత్నిస్తే చుట్టు ఉన్నా తీగలను తాకితే అసంపూర్ణ విద్యుత్ వలయం సంపూర్ణ విద్యుత్ వలయంగా మారి బజర్ మోగుతుంది. దీంతో పశువులు ధాన్యంలోకి రాకుండా దూరంగా వెళ్తాయి. అతితక్కువ ఖర్చుతో పంట పొలాల్లో, ఇంటివద్ద సులభంగా ఏర్పాటు చేసుకోవచ్చు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

వాంకిడి: కెరమెరి మండలం కోట గ్రామానికి చెందిన కొటాంబె ధన్‌రాజ్ ఇంట్లో ఈ నెల 28న తనిఖీలు నిర్వహించి సుమారు రూ.1.50 లక్షల విలువైన 6.100కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయి వాడకం ప్రమాదకరమని, దీని వల్ల జీవితాలు నాశనమవుతాయని సూచించారు. గంజాయి సాగు చేసిన, విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గంజాయి నివారణకు పటిష్టమైన ని ఘా ఏర్పాటు చేశామని అన్నారు. కెరమెరి ఎస్సై విజయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు ధ్వంసం

జైనూర్: మండలంలోని బాబుల్‌గూడ గ్రామంలో ఆత్రం తుకారాం పత్తి చేనులో సాగుచేస్తున్న నిషేధిత గంజాయి మొక్కలను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండంలోని బాబుల్‌గూడ గ్రామంలో నిషేధిత గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారనే ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి 14 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. ఆత్రం తుకారాం అనే రైతుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతి


బిరుదుల చంద్రశేఖర్ (ఫైల్)


నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుడు గుండెపోటుతో మృతిచెందిన సంఘటన శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో గురువారం చోటుచేసుకుంది. మందమర్రి పట్టణంలోని మూడో జోన్‌కు చెందిన బిరుదుల శేఖర్(57) అనే బదిలీ కార్మికుడు గురువారం రెండో షిఫ్ట్ విధులకు హాజరయ్యాడు. విధులు ముగించుకొనే క్రమంలో ఒక్కసారిగా ఛాతిలోనొప్పి వస్తుందని కుప్పకూలాడు. వెంటనే తోటి కార్మికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే కంపెనీ వాహనంలో రామకృష్ణపూర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ప్రదీప్, కూతుర్లు శ్వేత, స్వాతి ఉన్నారు. గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్‌తో పాటు ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ఎస్కే బాజీసైదా, ఫిట్ సెక్రెటరీ నర్సింగరావు శుక్రవారం ఏరియా ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: పీఆర్‌టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంను ఆ సంఘం నేతలు కలిశారు. శుక్రవారం పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణలు కలిసి పలు సమస్యలు పరిష్కారించాలని కోరినట్లు జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు.

యువతి మౌనపోరాటానికి ఎమ్మార్పీఎస్ మద్దతు


యువతికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన యువతి మౌన పోరాటానికి ఎమ్మార్పీఎస్ మద్దతు తెలిపింది. ఇదే గ్రామానికి చెందిన యువకుడు తనను పెళ్లి చేసుకోవాలని యువతి చేపటిన మౌనపోరాటం శుక్రవారం మూడో రోజుకు చేరింది. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ యువకుడు యువతితో సహజీవనం చేసి పెళ్లి అనేసరికి నిరాకరించాడని, భంగపాటుకు గురై అతడి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టిందని తెలిపారు. యువతిని పెళ్లి చేసుకోని పక్షంలో పెద్దయెత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. యువతి ఇంటిపై యువకుడి కుటుంబ సభ్యులు దాడి చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కటూరి వేణు, నాయకులు చెన్నూరి శ్రీనివాస్, జీడీ సారంగం, రాజేశ్, నరేశ్, రాజు, మల్లేశ్, తాళ్లపల్లి రాజు, బిరుదుల రాజు, కల్వల శేఖర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామానికి చెందిన మహెముదా, రేష్మాలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన తాళ్లపల్లి భవానీ ప్రేమించి మోసపోగా అదే గ్రామానికి చెందిన సమీర్ ఇంటి ముందు ఈ నెల 27నుంచి నుంచి మౌనపోరాటం చేస్తోందని తెలిపారు. సమీర్ తల్లి మహెముదా, సోదరి రేష్మా బుధవారం భవానీ తల్లి పుష్పలత ఇంటికి వెళ్లి గొడవ చేశారని, పుష్పలతపై భౌతికదాడికి దిగి కులం పేరుతో దూషించారని పేర్కొన్నారు. గొడవను అడ్డుకునేందుకు వెళ్లిన పుష్పలత భర్తపైనా దాడి చేశారని, స్థానికులు లింగంపల్లి మల్లేశ్, బిరుదుల లక్ష్మి, తోటపల్లి పోసమ్మ అడ్డుకునే ప్రయత్నం చేయగా దుర్భాషలాడారని వివరించారు. విచక్షణారహితంగా తమపై దాడికి పాల్పడి కులం పేరుతో దూషించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహెమూదా, రేష్మాలపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ సమావేశంలో జిల్లా టీఎన్జీవో సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కోల్‌కతాలో ఈ నెల 30వ తేదీ వరకు జరిగే అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో మంచిర్యాల జిల్లా టీఎన్జీవో యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. శుక్రవారం పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలోని సమీర్ భట్టాచార్య మంచ్‌లో జరిగిన జాతీయ సమావేశంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నాయకత్వంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, అటవీ శాఖా రాష్ట్ర ఫోరం అధ్యక్షుడు, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య, మాజీ అధ్యక్షుడు కందుకూరి సురేశ్‌బాబు ఉన్నారు.

భార్యపై కానిస్టేబుల్ దాడి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పోలీసుశాఖ స్పెషల్ పార్టీలో విధులు నిర్వహిస్తున్న మాదవరం రాజేష్ భార్య మౌనికపై గురువారం ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మౌనికను ఆసిఫాబాద్ ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితురాలి వివరాల ప్రకారం... మూడేళ్ల క్రితం రాజేష్‌తో వివాహమైందని, 18నెలల బాబు ఉన్నాడని పేర్కొంది. కానిస్టేబుల్ ఉద్యోగం కావడంతో వివాహ సమయంలో కట్నంగా రూ.20లక్షలు ఇచ్చామని, అదనపు కట్నం కావాలని వేధింపులకు గురిచేస్తున్నాడని వాపోయింది. గ్రూప్స్ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న సమయంలో ఆరునెలలు వేతనం రాదని, ఇంటి అద్దె డబ్బులు చెల్లించాలని వేధించాడని చెప్పింది. కుమారుడి పుట్టివెంట్రుకల కార్యక్రమానికి రూ.2లక్షలు తీసుకురావాలని తీవ్రంగా ఒత్తిడి చేస్తూ తరచూ గొడవపడుతున్నాడని, గురువారం రాత్రి ఈ విషయమై గొడవకు దిగి ఇనుపరాడ్డుతో దాడిచేశాడని తెలిపింది. తన భర్తకు వేరే స్త్రీతో వివాహేతర సంబంధం ఉందని, అందుకే తరచు గొడవపడుతూ దాడి చేస్తున్నాడని ఆరోపించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ శుక్రవారం తెలిపాడు.